




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# టంగుటూరి సూర్యకుమారి

## రెండవ భాగం



**నటి ,గాయని, నృత్య కళాకారిణి స్వాతంత్ర్య సమర గాయకురాలు అన్నింటికీ మించి మా తెలుగు తల్లికి మల్లెపూదండ స్వర్గీయ టంగుటూరి సూర్యకుమారి గారి గురించిన కార్యక్రమం రెండవ భాగం-**

*ముందుగా మొట్టమొదటి భాగంలో ఎంతవరకు మాట్లాడుకున్నామో క్లుప్తంగా గుర్తుతెచ్చుకుని తరువాత ఈ రోజు విశేషాల్లోకి వెళదాం. టంగుటూరి సూర్యకుమారి గారి గురించిన బాల్యాన్ని ప్రారంభించేటప్పుడు వాళ్ళ పెదనాన్న గారు టంగుటూరి ప్రకాశం పంతులు గారి దగ్గర మొదలుపెట్టాం. ప్రకాశం పంతులుగారి తమ్ముడు శ్రీరాములుగారు, శ్రీరాములు గారి ఆరవ సంతానం టంగుటూరి సూర్యప్రకాశమ్మ, తర్వాతి రోజుల్లో టంగుటూరి సూర్యకుమారిగారు ఆత్మీయులకు సూర్య గారు. టంగుటూరి సూర్యకుమారిగారు పాటతో పెట్టిపుట్టిన బాల గాయనిగా ఆమె పసితనంలోనే పాటలు పాడడం అలవోకగా ఎలా ప్రారంభించారో తెలుసుకున్నాము. చిన్నప్పుడు ఆవిడ పాడిన*

*పాటలకు వచ్చిన గుర్తింపు కూడా తెలుసుకున్నాము. మద్రాసులో వాళ్ళ అక్కయ్య గారింటికి వచ్చినప్పుడు అనుకోకుండా ఆవిడ్ని చూసినటువంటి తమిళ నిర్మాతలు ఆమెకు 12 సంవత్సరాల వయసులోనే విప్రనారాయణ అనే సినిమాలో ఒక బాలనటిగా పాత్ర ఇవ్వడంతో, టంగుటూరి సూర్యకుమారి గారి వెండితెర జీవితం ప్రారంభమైంది. ఇది 1937లో జరిగింది. అప్పట్లో నటించేవాళ్ళందరూ వారి పాటలు వాళ్ళే పాడుకోవాలి. సూర్యకుమారిగారి నట జీవితం కూడా ఒకేసారి ప్రారంభమైంది. ఆమె నటించిన మూడవ తమిళ చిత్రం అదృష్టం . ఆ సినిమాలో సూర్యకుమారి గారు పాడిన పాటలకి విపరీతమైన ప్రజాదరణ పొందడంతో ఆమెకి చాలా గుర్తింపు వచ్చింది. తమిళ ప్రజల్లోనూ.తెలుగు ప్రజల్లోనూ కూడా. ఆ తర్వాత తెలుగులో ఆమె నటించిన రైతుబిడ్డ , దేవత, ఇలాంటి చిత్రాలు సూర్యకుమారిగారికి గాయనిగానూ, నటిగానూ కూడా మంచి పేరు తెచ్చిపెట్టాయి. అక్కడి నుంచి ప్రారంభించి 1942లో వచ్చిన దీనబంధు అనే సినిమా టంగుటూరి సూర్యకుమారిగారి నట జీవితంలోనూ , గాయని గానూ కూడా ఒక చక్కటి మలుపు అని చెప్పుకోవాలి. ఎందుకంటే ఆ దీనబంధు చిత్రంలో పాటలు రాసిన శంకరంబాడి సుందరాచార్యగారు రాసిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే పాటని ఆవిడ ప్రైవేట్ రికార్డుగా ఇచ్చారు. ఇదంతా 1942 -43 ప్రాంతాల్లోనే. ఇప్పటికూడా అదే పాటతో టంగుటూరి సూర్య కుమారిగారిని తెలుగు వాళ్ళందరూ గుర్తుపెట్టుకుంటున్నారు. ఇంతవరకూ కిందటి వారం మాట్లాడుకున్నాం. ఇక్కడ్నుంచి ప్రారంభించి ఈ రోజు విశేషాల్లోకి వెళదాం.*

దీనబంధు సినిమా 1942 లో అయిపోయాక, 1943 లో భాగ్యలక్ష్మి అని చిత్తూరు నాగయ్యగారి సొంత సినిమా కూడా ఒక ముఖ్య పాత్ర ధరించారు టంగుటూరి సూర్యకుమారిగారు. దాని తర్వాత 1943 లోనే వచ్చింది చాలా ప్రజాదరణ పొందిన చిత్రం కృష్ణ ప్రేమ. ఈ చిత్రం చిత్రీకరణ సందర్భంలోనే భానుమతి గారు, రామకృష్ణ గారు ఒకరినొకళ్ళు ఇష్టపడడం, వివాహం చేసుకోవడం జరిగింది. ఆ విశేషాలన్నీ మనం భానుమతిగారి గురించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుసుకున్నాం. ఆ కృష్ణప్రేమ సినిమాలో టంగుటూరి సూర్యకుమారిగారు నారదుడి పాత్ర ధరించారు. ఈ విధంగా ఒక మహిళ మగ పాత్రని పూర్తిస్థాయి వేషంగా ధరించటం బహుశా టంగుటూరి సూర్యకుమారిగారి విషయంలో మాత్రమే జరిగిందేమో! చాలా సినిమాల్లో ఆడవాళ్లు నారదుడి పాత్రని ఏ అంతర్నాటకంలోని భాగంగానే నటించి ఉంటారు కానీ మొట్టమొదటగా పూర్తి స్థాయి నారద పాత్ర ధరించింది మాత్రం టంగుటూరి సూర్యకుమారిగారు అని చెప్పుకోవచ్చు. సూర్యకుమారి గారు నారద పాత్రలో పాడిన పాటలు ఎంతగా ప్రేక్షకులని అలరించాయంటే, ఆవిడ నారదుడిగా వెండితెరపై కనిపించగానే ప్రేక్షకులు చప్పట్లుకొట్టేవారట. ఆ నారద పాత్ర భానుమతి గారిని కూడా ఎంతగా ఆకర్షించిందంటే, ఆ తర్వాత భానుమతి గారు ఏదైనా సినిమాలో అవకాశం వస్తే తప్పనిసరిగా నారదుడి పాత్రను పోషించాలి అనే స్ఫూర్తినిచ్చింది. అంతే కాకుండా భానుమతి గారు ఈ టంగుటూరి సూర్యకుమారిగారు నారద పాత్ర లో ఎలాంటి వేషధారణ ధరించారో అలాంటి వేషధారణతో ఆవిడ స్టిల్స్ కూడా తీయించుకున్నారు. అయితే తరవాత ఎక్కడా సినిమాల్లో నారదపాత్ర ధరించలేదనుకోండి! అంత స్ఫూర్తిని కలిగించారు టంగుటూరి సూర్యకుమారి గారు తన నారద పాత్ర తోటి.

కృష్ణప్రేమ చిత్రం 1943లో అంటే అప్పటికి సూర్యకుమారిగారికి 18 సంవత్సరాల వయసు. 18 సంవత్సరాల వయసు వచ్చేసరికే ఆవిడ 14 సినిమాల్లో నటించారు. కాకపోతే అవన్నీ కూడా విపరీతమైన ప్రజాదరణ పొందినవి కాకపోవడం, అలాగే టంగుటూరి సూర్యకుమారి గారు నటించినవి గ్లామరస్ పాత్రలు కాకపోవడంతో, నటిగా కంటే కూడా ఆవిడకి గాయనిగానే ఆ రోజుల్లో ఎక్కువ పేరు తెచ్చుకున్నారు. సంఖ్యాపరంగా చూసుకుంటే మాత్రం 14 సినిమాల్లో నటించారు. ఈ సినిమాల్లో పాటలు పాడేటప్పుడు అక్కడక్కడా శాస్త్రీయ పరమైనటువంటి కీర్తనలు పాడాల్సివచ్చేది. అలాగే ప్రముఖ సంగీత దర్శకుల దగ్గర పనిచేసేటప్పుడు రాగాలు ఇలాంటివన్నీ తెలియాలి. చిన్నప్పట్నుంచి సూర్యకుమారిగారు స్కూల్ కీ వెళ్ళలేదు, శాస్త్రీయ సంగీతమూ నేర్చుకోలేదు. మరి ఇలాంటివన్నీ ఎలా చేశారు? అంటే, ఆవిడ సినిమాల్లో నటిస్తూ పాడుతున్న రోజుల్లోనే శాస్త్రీయంగా సంగీతం నేర్చుకోవడం కూడా ప్రారంభించారు.ఒక వైపు నటిగా, గాయనిగా కొనసాగుతూ రెండవ వైపు సంగీతంలో కూడా శిక్షణ తీసుకోవడం ప్రారంభించారు. అయితే,1943 వచ్చాక ఆవిడ స్థిరంగా నిర్ణయించుకున్నారు "సంగీతంలోనూ, నాట్యంలోనూ పూర్తి కాలం శిక్షణ తీసుకోవాలి" అని. అలాగే ఆవిడ ఎప్పుడూ స్కూల్ కి వెళ్ళలేదు కాబట్టి కనీసం హై స్కూల్, మెట్రిక్యులేషన్ లాంటి డిగ్రీ అయినా సరే ఒకటి తీసుకోవాలని అనేటటువంటి నిర్ణయంతో ఆవిడ 1943 తర్వాత సినీ జీవితానికి కొంత విరామం ఇచ్చారు. ఇది కూడా చాలా మెచ్చుకోదగ్గ విషయం. ఎందుకంటే , ఆ సినీ గ్లామర్ లో పడి కొట్టుకొని పోకుండా ఆ సినిమా రంగం ఇచ్చినటువంటి ఖ్యాతిని అంటిపెట్టుకొని ఉండిపోకుండా తాను కూడా జీవితంలో సశాస్త్రీయంగా నేర్చుకోవాలి, చదువులో కూడా ఒక డిగ్రీ ఉండాలి అనే నిర్ణయాన్ని తీసుకోవడం, 18 సంవత్సరాల అమ్మాయి విషయంలో, చాలా మెచ్చుకోవాలి.

అలా ఆవిడ విరామం తీసుకున్నాక అంతకు ముందు నుంచి కొనసాగుతున్నటువంటి సంగీత శిక్షణని ఆవిడ కొనసాగించారు. ఎలాగంటే అరైకూడి రామానుజ ఐయ్యంగార్ అనే అయన దగ్గర, అలాగే ప్రతాపన్ నటేశయ్యర్ అనే ఆయన దగ్గర ఆవిడ కర్ణాటక సంగీతాన్ని కొనసాగించారు. వీళ్ళిద్దరే కాదు అక్కడక్క మరికొంతమంది గురువుల దగ్గర కూడా నేర్చుకున్నారని చెపుతూ ఉంటారు. అలాగే పండిట్ జోషి అని ఆయన దగ్గర భరత నాట్యం నేర్చుకున్నారు. వేదాంతం జగన్నాథ శర్మగారు, నాట్య కులపతి రామకోటిగారు వాళ్ళ దగ్గర కూచిపూడి నృత్యం నేర్చుకున్నారు. అయితే నాట్యగత్తెగా ఆమె కొద్ది ప్రదర్శనలిచ్చారు గాని ముఖ్యంగా గాయనిగానే ఆవిడ తర్వాత కాలంలో కొనసాగారు.. ఇవి ఇలా నేర్చుకుంటూనే ఆవిడా ప్రైవేటు గీతాలు రికార్డులుగా కూడా ఇస్తూ ఉండేవాళ్ళు. అది మాత్రం మానలేదు. ఇది కాకుండా చదువు విషయంలో – ఆవిడ సీనియర్ కేంబ్రిడ్జి పరీక్ష రాశారు. సీనియర్ కేంబ్రిడ్జి పరీక్ష అంటే మెట్రిక్యులేషన్ లాంటిది. కాకపోతే, ఆ పరీక్ష కొంతమంది లండన్ వెళ్లి రాసేవాళ్ళు, భారతదేశంలో రాసినప్పటికీ ఆ పేపర్లన్నీ లండన్ పంపించి అక్కడ కరెక్షన్ చేయించి తీసుకొచ్చేవాళ్ళు. ఆ విధంగా చూసుకున్నట్టయితే విదేశాలనుంచి వచ్చినటువంటి డిగ్రీ అనుకోవచ్చు. అలాంటి సీనియర్ కేంబ్రిడ్జి పరీక్ష రాసిన మొట్టమొదటి తెలుగు నటీమణి టంగుటూరి సూర్యకుమారి అని చెప్పుకోవాలి. అది 1946 కో, ఎప్పటికో అయ్యింది. ఒక వైపు నేర్చుకోవడం, మరో వైపు పాటలు రికార్డులివ్వడం, ఇంకో వైపు చదువుకోవడం ఇవి కాకుండా – అదే రోజుల్లో టంగుటూరి సూర్యకుమారిగారు వాళ్ళ పెదనాన్నగారు స్వాతంత్ర్య సమరంలో చాలా చురుకుగా పాల్గొంటున్నప్పుడు ఆయనతో పాటుగా ఈ రాజకీయ వేదికలమీదకు వెళుతుండేవాళ్లు. ఆ రాజకీయ సభలు జరుగుతున్నప్పుడు ముందులో ప్రార్థనా గీతం గాని, చివరలో ప్రేక్షకులను అలరించడం కోసం గాని ఆవిడ దేశభక్తి గీతాలను పాడుతూ ఉండేవాళ్ళు. కొన్నిసార్లు ప్రకాశం పంతులు గారే అనేవాళ్లట "ముందుగా నీవు పాడొద్దు. పాడితే అందరూ ఆ పాటలే కావాలంటారు.మా ఉపన్యాసాలయ్యాక పాడుదువు గాని" అని. అంతగా ప్రజలని ఆకర్షించారు టంగుటూరి సూర్యకుమారి గారు ఆ దేశభక్తి గీతాలతో కూడాను. ఆవిడ పాడిన లలితగీతాలకి ఆ రోజుల్లో, చాలా ప్రజాదరణ పొందబోయే చిత్రానికి ఇచ్చినంతటి ప్రాచుర్యాన్ని, ప్రకటనల్నిఇస్తూ ఉండేవాళ్ళు. ఒక్కొక్క రికార్డు విడుదలైనప్పుడు దానికోసం పేపర్లో ప్రత్యేకంగా ప్రకటనలొచ్చేవి. టంగుటూరి సూర్యకుమారిగారు పాడిన రెండు పాటలు పలానా కొలంబియా వాళ్ళు విడుదల చేస్తున్నారు లేకపోతే సరస్వతి స్టోర్ వాళ్ళు విడుదల చేస్తున్నారు అని పెద్ద పెద్ద పేపర్ లో ప్రకటన లిచ్చేవారు. అది ఆ రోజుల్లో గాయనిగా టంగుటూరి సూర్యకుమారి గారికి ఉన్నటువంటి ప్రజాదరణ!! కొన్నికొన్ని రెస్టారెంట్స్ లో టిఫిన్లు అవి చేసేటప్పుడు ఆ టిఫినైపోయాక టంగుటూరి సూర్యకుమారి గారి పాట ఉంది, టంగుటూరి సూర్యకుమారిగారి పాట వింటే గనక అదనంగా చార్జీలు చెల్లించాలి అని హోటల్లో వసూలు చేసేవారట. అంతగా టంగుటూరి సూర్యకుమారి గారి పాటల్ని ప్రజలు ఇష్టపడుతుండే వాళ్లు 1944 –45 ప్రాంతాల్లోనే.

ఆవిడ పెదనాన్నతో రాజకీయ సభలకి వెళ్లడం అలాంటి వాటికి కొన్ని ఉదాహరణలు చెప్పుకోవాలంటే,గుడివాడలోనో ఎక్కడో ఒకచోట రాజకీయ సభ జరుగుతున్నప్పుడు టంగుటూరి సూర్యకుమారి గారి పాటలు మధ్యలో పాడడం ప్రారంభించారట. కొన్ని ఉపన్యాసాలైన తర్వాత ఈవిడ పాటలు , మళ్ళీ ఉపన్యాసాలు రావాలి. ఈవిడ పాడటం ప్రారంభించాక మళ్ళీ ఉపన్యాసాల్ని మొదలు పెట్టనివ్వలేదట. సూర్యకుమారి గారే పాడాలి అన్నారట. ఆ విధంగా మిగతా సగం సభ జరగకుండగానే సూర్యకుమారి గారి పాటలతోటే ఆ రోజంతా ముగిసిపోయింది. ఇంకోసారి తెనాలిలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు జరుగుతుంటే, అక్కడకి వెళ్లి నాలుగు రోడ్ల కూడలి లోనూ ఆవిడ గొంతెత్తి పాడడడం ప్రారంభించారు. అలా త్యాగరాజ కీర్తనల్ని పాడుతుంటే వచ్చిన ప్రేక్షకులందరూ వాటిని విని ఆనందిస్తూనే, మాకు దేశభక్తి గీతాలు కావాలి అని డిమాండ్ చేసేసరికి "ముందు ఈ పాటలు వినండి తర్వాత అవి పాడతాను" అని త్యాగరాజ కీర్తనలయ్యాక దాదాపుగా గంటన్నరసేపు దేశభక్తి గీతాలు పాడితే గాని ప్రేక్షకులు వదిలిపెట్టలేదు.

అంటే పాటల ప్రసక్తి వచ్చింది కాబట్టి, ఇంకో విషయం ఇప్పుడే చెప్పేస్తున్నాను. అనంతపూర్ లో టంగుటూరి సూర్యకుమారిగారి పాట కచేరీ గాన గాత్ర ప్రదర్శన అని ఏర్పాటు చేశారు. అది రెండు రోజులు జరిగింది. గానప్రదర్శన అయ్యాక భారత నాట్యం కూడా చేశారక్కడ. ఒక బెనిఫిట్ షో లాగా విరాళాల సేకరణ కోసమని. రెండు రోజులకి కలిపి అత్యధిక టికెట్ వసూలు చేసింది 116 రూపాయలు అతి తక్కువ 10 రూపాయలు.1948 ప్రాంతాల్లో 116 రూపాయల టిక్కెట్టు ని డిమాండు చేయగలిగినటువంటి గాయని టంగుటూరి సూర్యకుమారి గారు. అది ఆవిడకున్న ప్రాచుర్యానికి, ఆవిడకున్న ప్రత్యేకతలకి ఒక నిదర్శనం.ఆ రోజుల్లో 116 రూపాయలంటే, ఇప్పట్లో కొన్ని వేలకిసమానం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!!

అప్పటికి ఆమె వయసు చూసుకుంటే, 20, 21 సంవత్సరాలు మాత్రమే! ఆ వయసులో ఆవిడ ఎన్ని పనులు చేశారో చూడండి! ఒక వైపు నేర్చుకోవడం, ఇంకో వైపు చదువుకోవడం, ఇంకో వైపు రికార్డులివ్వడం, ఇంకో వైపు పెదనాన్నతో వెళ్లి ఆ స్వాతంత్ర్య గీతాలు అవి పాడడం. ఆ రోజుల్లో

స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వాళ్లందరినీ కూడా స్వాతంత్ర్య సమర యోధులు అనేవారు కదా! ఒక విధంగా చూస్తే,టంగుటూరి సూర్యకుమారి గారిని స్వాతంత్ర్య సమర గాయని అని కూడా చెప్పుకోవచ్చు. దానికొక ఉదాహరణేమిటంటే, 1947 ,ఆగష్టు 15 న మనకు స్వాతంత్ర్యం వచ్చిన విషయం అందరికీ తెలుసు కదా. ఆ రోజు కార్యక్రమమేమిటంటే, అర్ధరాత్రి పూట జవహర్ లాల్ నెహ్రుగారు ప్రసంగిస్తారు ఢిల్లీ నుంచి. ప్రాంతీయ రేడియో కేంద్రాలన్నీ కూడా దాన్ని రిలే చేయాలి, నెహ్రుగారి ప్రసంగం అయిపోయాక స్థానిక రేడియో కేంద్రం వాళ్ళు. వాళ్ళ వాళ్ళ కార్యక్రమాలు ప్రసారం చేసుకోవాలి. అందులో భాగంగా మద్రాసు ఆకాశవాణి వాళ్ళు ఆ ఆగష్టు స్వాతంత్ర్య దినోత్సవం అర్ధరాత్రి నెహ్రుగారి ప్రసంగమయ్యాక స్థానిక కార్యక్రమాల్లో భాగంగా పట్టమ్మాళ్ గారి పాటని ముందు వినిపించారు. ఆ తర్వాత రెండు పాటలు టంగుటూరి సూర్యకుమారిగారితో పాడించారు. ఆ పాడించింది, ఆ పాటలు రాసింది బాలాంత్రపు రజనీకాంతరావుగారు. ఆయన ఆ ముందు రోజు మధ్యాహ్నం సూర్యకుమారి గారిని ఆకాశవాణి కేంద్రానికి పిలిపించి, వాటిని నేర్పించి, ఆ రాత్రి వాటిని పాడించారు. అదికూడా టంగుటూరి సూర్యకుమారి గారికి దక్కిన అరుదైన అవకాశం.

ఆ తర్వాత 1948లో మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవ వార్షికోత్సవం జరిగినప్పుడు కూడా, ఆకాశవాణి కేంద్రం నుంచి, "మాదీ స్వతంత్ర్య దేశం " పాట పాడారు టంగుటూరి సూర్యకుమారిగారు. ఇలా కేవలం పాటలు పాడడమూ, నేర్చుకోవడమే కాకుండా టంగుటూరి సూర్యకుమారి గారు ఆ 1944-48 ఆ మధ్యలో ఆవిడ చేసినటువంటి మరొక గొప్ప కార్యక్రమం ఒకటుంది. దీని గురించి చాల చోట్ల వ్రాయలేదు, కేవలం గాయనిగానే చెబుతూ ఉంటారు గాని,ఆవిడ ఆ రోజుల్లోనే గీత ప్రకాష్ అనే సంస్థని ప్రారంభించి, ఆ సంస్థ తరఫున గాన కచేరీలు చేస్తూ ఆ గాన కచేరీల వల్ల వచ్చిన విరాళాలని, ధనాన్ని కూడా ఆవిడ సంఘ సేవా కార్యక్రమాలకి వినియోగించారు. కేవలం గాయనిగా ఆవిడకి వస్తున్నటువంటి పాపులారిటీని ఏదో తాను డబ్బు సంపాదించుకోవడం కాకుండా ఆ వచ్చినటువంటి వాటిని రెడ్ క్రాస్ సొసైటీ కి , రామకృష్ణ మిషన్ కి ఇలాంటి వాటికి ఇస్తూ ఉండేవాళ్ళు. దాన్ని ఒక ఉద్యమం లాగా కూడా కొన్నిసంవత్సరాలు కొనసాగించారు. విశ్రాంతిపురం ట్యూబర్ క్లోసిస్ శానిటోరియం అని రాజమండ్రి లో ఉండేది ఆ రోజుల్లో. వాళ్ళు ఒక కొత్త భవనం కట్టాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు 1948 లో వాళ్ళకోసమని ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని అంటే ఒక గాన కార్యక్రమాన్ని టంగుటూరి సూర్యకుమారి గారు ప్రదర్శన ఇచ్చి దాని ద్వారా వచ్చిన విరాళాలతోటి ఆ ట్యూబర్ క్లోసిస్ శానిటోరియం కి ఒక ప్రత్యేకమైనటువంటి భవనాన్నికట్టిస్తే, దానికి ఆవిడ పేరే పెట్టారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే! ఆ విధంగా, సంఘసేవా కార్యక్రమాల కోసం విరాళాల కోసమని టంగుటూరి సూర్యకుమారి గారు ఆంధ్రదేశం నాలుగు చెరగులా తిరిగారు. కేవలం ఆంధ్ర దేశమే కాకుండా బయట రాష్ట్రాల్లోని పాట్నా, లక్నో లాంటి ప్రదేశాలకి కూడా వెళ్లి అక్కడ గాన కచేరీలు చేసి ఆ విరాళాలని ఈ సంస్థలకి ఇస్తూ ఉండేవాళ్ళు. ఇలా 1943 నుంచి 1948 వరకూ కూడా టంగుటూరి సూర్యకుమారి గారు సినీ రంగానికి దూరంగా ఇన్ని కార్యక్రమాలతో ఉన్నారు.

మళ్ళా 1948 ప్రాంతాల్లో సినిమాల్లో పాత్రలు ధరించడం ప్రారంభించారు. దాన్ని రెండో ఇన్నింగ్స్ అని చెప్పుకోవచ్చు. నటిగా టంగుటూరి సూర్యకుమారి గారికి. ఆవిడ ఒక చాలా ప్రత్యేకమైన సినిమాలో నటించారు. ఆ సినిమా వచ్చి వెళ్లినట్లు చాలామందికి తెలియదు. ఆ సినిమా ప్రత్యేకతలేమిటంటే, ఆ సినిమాకు రచన చేసింది విశ్వనాథ సత్యనారాయణ గారు. విశ్వనాథ సత్యనారాయణ గారు మొట్టమొదటగా చిత్రరచన చేసిన సినిమా 'గీతాంజలి' 1948 లో వచ్చింది. ఆ విషయాన్ని ఆయన డైరీలో కూడా రాసుకున్నారు. ఆ సినిమాను నిర్మించింది, దర్శకత్వం వహించింది జంధ్యాల గౌరీనాథ శాస్త్రిగారు. విజయవాడ వాసి. ఆయనే ఎన్.టి.రామారావు గారిని(ఆయన ఇంకా కాలేజీలో చదువుకునే రోజుల్లోనే) మహారథి కర్ణ నాటకంలో వేషం వేద్దువు గాని అని పిలిచారు. ఈ గీతాంజలి సినిమా గురించి మిగతా విశేషాలు ఎక్కడా లభ్యం కావడం లేదు. అదొక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు మనం. టంగుటూరి సూర్యకుమారి గారి నట జీవితాన్ని పరిశీలిస్తున్నప్పుడు. ఆ 1948 లో రెండవ విడత మళ్ళీ నటిగా ప్రారంభించాక ఆవిడ నటించిన సినిమాల్లో చెప్పుకోదగిన సినిమా లేమిటంటే — అదృష్టదీపుడు.. అది గుమ్మడి గారు మొట్టమొదటిసారిగా ఒక చిన్న పాత్ర ధరించిన చిత్రం. ఈ సినిమా లన్నిటిలో ఆవిడ నటిస్తున్నప్పుడు, తన పాటలు ఆవిడే పాడుకుంటూ ఉండేవాళ్ళు. భారతి అనే ఒక కన్నడ సినిమాలో కూడా నటించారు, అదే సంవత్సరాల్లో. టంగుటూరి సూర్యకుమారి గారు నటిగానూ, గాయని గానూ – చాలా ఆవిడ ముఖ్య పాత్ర ధరించింది , ఎక్కువ పాటలు పాడిన చిట్ట చివరి చిత్రం –మరదలుపెళ్లి అనే ఆ సినిమా. అది 1952 లో వచ్చింది. తర్వాతి రోజుల్లో కారక్టర్ నటుడిగానూ, విలన్ గానూ పనిచేసిన ముక్కామల గారు ఆ సినిమాకు నిర్మాత, దర్శకుడు., హీరో కూడాను. దానిలో కథానాయికగా నటించారు. కేవలం ఆ సినిమాలో నటించడం, పాటలు పాడడమే కాకుండా సూర్యకుమారి గారు నాగయ్య గారితో కలిసి ఈ మరదలుపెళ్లి చిత్రానికి సంగీత దర్శకత్వం కూడా వహించారు. అదికూడా ఆ సినిమా యొక్క

ప్రత్యేకత. ఈ సినిమాలో ఇంకో ఆసక్తికరమైన విశేషమేమిటంటే, సూర్యకుమారి గారి అన్నయ్య గారు టెన్నిస్ రామారావు గారని చెప్పుకున్నాం కదా! టెన్నిస్ కోచింగ్ చేస్తుండేవాళ్ళని, ఆయన కూడా ఈ మరదలుపెళ్లి సినిమాలో ఒక ముఖ్యమైన పాత్ర ధరించారు.

సుమారుగా అదే ప్రాంతాల్లో అంటే 1948 , 49 ,50 ఆ ప్రాంతాల్లో సూర్యకుమారిగారి నాన్నగారు శ్రీరాములు గారు మరణించారు. ఆయన మరణించాక దాదాపుగా కుటుంబ భారమంతా కూడా సూర్యకుమారి గారే చూసుకోవాల్సి వచ్చింది. ఎందుకంటే అన్నయ్యలిద్దరూ స్థిరమైన ఉద్యోగం లేనివాళ్లు. రామ్మోహన్ గారేమో పాటలు పాడుతుండేవాళ్లు. అలాగే రామారావు గారు టెన్నిస్ కోచింగ్ లో ఉండేవాళ్ళు. వాళ్ళు కూడా సూర్య కుమారిగారి తో పాటు ఉండేవాళ్ళు. అలాగే వితంతువైన తల్లి బాధ్యతలన్నీ కూడా భుజస్కందాలమీద వేసుకుని ఏ మాత్రం బెదరకుండా, చెదరకుండా చెక్కుచెదరని ధైర్యంతోటి సూర్యకుమారి గారు ఒక వైపు తన కెరీర్ ను కొనసాగిస్తూ రెండో వైపు కుటుంబ బాధ్యతలను కూడా తీసుకున్నారు. ఆవిడకి సహాయకురాలిగా వాళ్ళ అక్కయ్యగారి అమ్మాయి అనసూయ ఆవిడ చేదోడు వాదోడుగా ఉంటూ ఉండేవాళ్ళు. సూర్యకుమారి గారు అదే రోజుల్లో మద్రాసు లో స్వంతంగా ఇల్లు కూడా కట్టించుకున్నారు. కానీ గృహప్రవేశం చేసే సమయం వచ్చే సరికి వాళ్ళ నాన్నగారు లేకుండా అయ్యింది.

1952 లో ఈ మరదలుపెళ్లి చిత్రం పూర్తి అయినటువంటి కొద్ది రోజులకో లేకపోతే సుమారుగా ఆ సందర్భాల్లోనే మద్రాస్ లో మిస్ మద్రాస్ పోటీలు జరిగాయి. .ఆ అందాల పోటీల్లో పాల్గొన్నారు సూర్యకుమారి గారు. చాలామంది గొప్ప విశేషంగా చెప్పుకున్నారు. అలాంటి పోటీల్లో అగ్రవర్ణాలకి సంబంధించిన వాళ్ళు పాల్గొనడం కూడా ఎవరూ ఏ మాత్రం కూడా ఊహించనటువంటి విషయం. పైగా టంగుటూరి ప్రకాశం పంతులు గారి తమ్ముడు గారి అమ్మాయి.ధైర్యంగా ఆవిడ అందాల పోటీల్లో పాల్గొనడమే కాకుండా మొట్టమొదటి సారిగా మిస్ మద్రాస్ టైటిల్ ని గెలుచుకున్న తెలుగు అమ్మాయిగా చరిత్రలో. ఆ రోజుల్లో ఈ అందాల పోటీలు ప్రతి రాష్ట్రంలోనూ నిర్వహించి, ఈ రాష్ట్రాల్లో గెలిచిన వాళ్లందరినీ తీసుకొనివెళ్ళి బొంబాయిలో ఆ మిస్ ఇండియా పోటీలు నిర్వహించారు. వాటిల్లో మొట్టమొదటి స్థానాన్ని పొందినావిడ పేరు ఇంద్రాణి రెహమాన్. ద్వితీయ స్థానం మన సూర్యకుమారి గారిది. ఇలా మిస్ ఇండియా పోటీల్లో మొట్ట మొదటి ద్వితీయ స్థానాన్ని తెచ్చుకున్న తెలుగు అమ్మాయి కూడా సూర్యకుమారి గారే. ఆవిడకు రెండవ స్థానం రావడం కూడా ఒక విధంగా ఉపయోగమైంది. మొదటి స్థానం వచ్చి ఉంటె గనక ఆవిడకు అవకాశాలు వేరేవిధంగా వెళ్లి ఉండేవేమో.

సుమారుగా అదే రోజుల్లో ఇంకొక సంఘటన ఏమి జరిగిందంటే, మద్రాస్ లో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకి హాలీవుడ్ నుంచి ఫ్రాంక్ కాప్రా అని హాలీవుడ్ దర్శకుడు ( ఆయన ఆ రోజుల్లోనే మూడుసార్లు ఆస్కార్ అవార్డు తెచ్చుకున్నారు) వచ్చారు. అక్కడ సూర్యకుమారి గారు పరిచయమయ్యారు. సూర్యకుమారి గారికి మరొక ఉపయోగమేమిటంటే, ధారాళంగా ఇంగ్లీష్ మాట్లాడగలగడం, ఎవరితోనైనా ధైర్యంగా సంభాషించగలగడం. ఈ ఫ్రాంక్ కాప్రా పరిచయానికి ఆమె చొరవ, ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఉపయోగపడ్డాయి సూర్యకుమారి గారికి. మనిషి జీవితంలో ఒక్కొక్కసారి కొన్ని కొన్ని పరిచయాలు ఆసక్తికరమైన మలుపులు తిప్పుతుంటాయి. కొన్ని కొన్ని మలుపుల్లో ముఖ్యమైన వ్యక్తులు పరిచయమౌతూ ఉంటారు. సూర్యకుమారి గారి జీవితంలో ఒక ముఖ్యమైన మలుపుకి ఈ ఫ్రాంక్ కాప్రా పరిచయం కారణమైందని చెప్పుకోవచ్చు. చాలా మామూలుగా కనిపిస్తుంది కానీ,తర్వాత ఆవిడ జీవితం తిరిగినటువంటి మలుపులని గమనిస్తే గనక ఆ ఫ్రాంక్ కాప్రా పరిచయం కాక పోతే ఎలా ఉండేదో అనిపిస్తూ ఉంటుంది.

ఏమైందంటే ఫ్రాంక్ కాప్రా అంతర్జాతీయ చిత్రోత్సవాలు ముగిసి, హాలీవుడ్ కి వెళ్ళిపోయాక అమెరికా మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ అనే సంస్థ వాళ్ళు భారతదేశం నుంచి కొంతమంది కళాకారుల్ని ముఖ్యంగా సినిమా కళాకారుల్ని అమెరికాకు ఆహ్వానించదలుచుకున్నారు. వాళ్ళల్లో రాజ్ కపూర్, నర్గీస్,సోహారా మోడీ అప్పట్లో చాలా పేరున్న నటీనటులు ఉన్నారు. వాళ్ళతో పాటుగా ఆ బృందంలో సూర్యకుమారి గారి పేరు చేర్చడానికి కారణం ఈ ఫ్రాంక్ కాప్రా అన్నాయన. ఆ విధంగా అందాల పోటీల్లో మొట్టమొదటి బహుమతి రాకపోవడం తోటి , వేరే అవకాశాలకు వెళ్లకపోవడము , అలాగే ఈ ప్రతినిధివర్గంలో చేరడానికి కూడా అవకాశం దొరికింది సూర్యకుమారి గారికి 1952 లో. ఆ విధంగా, మొట్టమొదటి సారిగా 1952 సెప్టెంబర్లో , మిగతా ప్రతినిధి బృందం తోటి కలిసి సూర్యకుమారి గారు అమెరికా ప్రయాణమయ్యారు. తర్వాత ఏడు సంవత్సరాలకి మళ్ళా తాను వంటరిగా అమెరికా వస్తానని కానీ అమెరికా నుంచి తన జీవితం లోని ద్వితీయ భాగాన్ని ప్రారంభిస్తానని గాని సూర్యకుమారి గారికి అప్పుడు ఏమాత్రం ఆలోచన లేదు, అలాంటి ఆలోచన వచ్చే అవకాశం కూడా లేదు.

సూర్యకుమారిగారు 1952 లో ఈ అమెరికన్ మోషన్ పిక్చర్స్ అసోసియేషన్స్ వాళ్ళ ఆహ్వానం మీద మిగతా బృందంతో కలిసి చేసినటువంటి అమెరికా పర్యటన అనుభవాలని ఆ తర్వాత నాలుగైదు నెలలకు వచ్చినటువంటి 1953 లో వచ్చిన కినిమా అనే పత్రికలో చాలా వివరంగా రాశారు. ఆ

వ్యాసం చదువుతుంటే, అలనాటి అమెరికా పరిస్థితులు కూడా బాగా అర్ధమౌతుంటాయి. అప్పట్లో అమెరికాలో రవాణా సాధనాలు ఎలా ఉండేవి, అప్పట్లో ప్రజల అలవాట్లు ఎలా ఉండేవి, ఆచార వ్యవహారాలూ ఎలా ఉండేవి, అప్పట్లో స్టూడియోలు ఎలా ఉండేవి ఇలాంటి వన్నీ కూడా ఆవిడ చాల వివరంగా రాశారు ఆ వ్యాసంలో. ఈ ప్రతినిధి బృందం , అంటే , ,రాజ్ కపూర్, నర్గీస్ వీళ్ళందరూ కలిసి ముందుగా న్యూయార్క్ అలాగే ఆ తూర్పు ప్రాంతమంతా కూడా చూసుకొని న్యూయార్క్ , చికాగో,డెన్వర్ ఇలాంటివన్నిటిమీద ప్రయాణం చేసుకుంటూ చిట్టచివరికి లాస్ ఏంజిల్స్ చేరుకున్నారు. లాస్ ఏంజిల్స్ లో ఈ ప్రతినిధి బృందమంతో నాలుగైదు రోజులు సమావేశాలూ, వాళ్ళ పార్టీలూ ఇలాంటివన్నీ జరిగాయి. ఆ సమావేశాల్లో జనగణమణ, ఓ మహాత్మ, ఓ మహర్షి అనే శ్రీ శ్రీ గారి గేయం – ఇవన్నీ అన్నీకూడా పాడారు టంగుటూరి సూర్యకుమారి గారు. ఆ విధంగా హాలీవుడ్ లో మొట్టమొదటిసారిగా తెలుగు పాటలు పాడిన తెలుగు అమ్మాయి కూడా సూర్యకుమారి గారే అయ్యారు. అప్పటికామె వయసు కేవలం 27 సంవత్సరాలు మాత్రమే. ఇంకా, ఆ హాలీవుడ్లో జరిగినటువంటి సమావేశాల్లో కొన్ని ఆసక్తికరమైనటువంటి విశేషాలేమిటంటే – వార్నర్ బ్రదర్స్ స్టూడియోలో సమావేశం జరుగుతోంది. ఆ సమావేశానికి ప్రతినిధి బృందాన్ని తీసికెళ్ళేటటువంటి వాళ్ళల్లో హిచ్ కాక్ కూడా ఉన్నారు. ప్రసిద్ధ హాలీవుడ్ దర్శకుడు. సూర్యకుమారి గారిని హోటల్ నుంచి సమావేశానికి తీసుకెళ్లడం మళ్ళీ వెనక్కి పంపించడం అనే బాధ్యత ఆయనది. అక్కడ హిచ్ కాక్ పరిచయమయ్యారు. మళ్ళా జీవితంలో ఒక్కొక్క మలుపు ఎలా తిరుగుతుంది,ఒక్కొక్క పరిచయం ఎలా జరుగుతుంది అనడానికి హిచ్ కాక్ గారితో పరిచయం కూడా తర్వాతి రోజుల్లో ముఖ్యమైన మలుపుకు దారి తీసింది. ఆయన సూర్యకుమారి గారిని చూసి "మీలో అమెరికన్ లక్షణాలు కూడా కనబడుతున్నాయి, కొంచెం మేకప్ చేస్తే గనక మిమ్మల్ని అమెరికన్ యువతిగా కూడా చూపించవచ్చు. మీతో, ప్రేమ్ నాథ్ తో( ఆయన కూడా ఆ బృందంలో ఉన్నారు) నేనొక చిత్రం నిర్మిస్తాను" అనికూడా హిచ్ కాక్ చెప్పారట. ఆ తర్వాత ఆయనే కాకుండా మరొక ఇద్దరు ముగ్గురు కూడా వీళ్ళ తో సినిమా నిర్మించటానికి ముందుకొచ్చారు. అక్కడున్నటువంటి అసోసియేషన్ నియమ నిబంధనల వల్ల వీళ్ళు అమెరికాలోనే ఉండిపోయి సినిమాల్లో నటించే అవకాశం లేదు. అందువల్ల కేవలం వారి ప్రతిపాదనలు ప్రతిపాదనలుగానే ఉండిపోయాయి. ఇంకా హాలీవుడ్ సమావేశాలలో అప్పటి మరొక ప్రసిద్ధ దర్శకుడు సిసిల్ బి డెమిల్ అనే ఆయన
సూర్యకుమారి గారిని చూసి "నేను టెన్ కామండ్మెంట్స్ సినిమా తీయబోతున్నాను అయితే చాలా సంవత్సరాలు పడుతుంది. ఇప్పుడే అయిపోదు ఆ సినిమాలో తప్పనిసరిగా మీకొక అవకాశమిస్తాను మీరు ఈ ప్రతినిధి బృందం తో వచ్చారు కాబట్టి మళ్ళా భారతదేశం వెళ్ళిపోయాక తప్పనిసరిగా మిమ్మల్ని ఆహ్వానించి హాలీవుడ్ చిత్రంలో మీకు అవకాశాలిస్తాన"ని అన్నారు. ఈ పర్యటన .విజయవంతంగా ముగించుకుని సూర్యకుమారి గారు మళ్ళీ మద్రాసు చేరుకున్నారు.

వెనక్కి వచ్చేశాక మద్రాస్ లో ఆవిడకి బ్రహ్మరథం పట్టారు. మామూలు ప్రేక్షకులకు ఈ విషయాలు అంతగా తెలీకపోయినా, చిత్రపరిశ్రమలోని ప్రముఖులు సూర్యకుమారిగారి గురించి గొప్పగా చెప్పుకున్నారు. ఒక స్పోర్ట్స్ పత్రిక రాసిన ఇంటర్వ్యూ లో మద్రాస్ గోస్ వెస్ట్ అని ఒక వ్యాసం రాస్తూ సూర్యకుమారి గారు ఇలాగా హాలీవుడ్ వెళ్లొచ్చారు. బహుశా మళ్ళీ హాలీవుడ్ వెళ్ళిపోతారు అక్కడి సినిమాల్లోనే ఆవిడ స్థిరపడి పోతారు అన్నట్లుగా రాశారు. ఇంకోసంఘటన– బొంబాయి సినీ నటులకూ, మద్రాస్ సినీ నటుకూ మధ్య క్రికెట్ పోటీలు జరుగుతుంటే, సూర్యకుమారి గారిని ప్రత్యేకంగా దానికి ఆహ్వానించి అందులో పాల్గొనే లాగా చేశారు. ఆ క్రికెట్ పోటీల్లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న వాళ్లలో ఎస్.వి.రంగారావు గారు, శివరావు గారు లాంటివారు కూడా ఉన్నారు. దీన్ని పెద్ద విశేషంగా ఎందుకు చెబుతున్నానంటే, ఆవిడకున్నటువంటి గుర్తింపు ఎంతగా పెరిగింది విదేశాలు వెళ్లొచ్చాక అని తెలియడానికి.

హిందీ చిత్రం వాళ్ళతోటి పరిచయాలు కూడా పెరగడంతో ఆ పర్యటన తర్వాత హిందీ చిత్రసీమ నుంచి ఎక్కువగా అవకాశాలొచ్చాయి. ఆ అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ ఆవిడ మొట్టమొదటిసారిగా నటించిన హిందీ చిత్రం'వతన్' . ఆవిడ అమెరికా నుంచి వచ్చిన రెండు వారాల్లోనే ఈ వతన్ అనే సినిమాలో వేషం వేయడం కోసమని బొంబాయి వెళ్లారు. అప్పటికి నాన్నగారు లేరు. ఈ డబ్బుల వ్యవహారం గాని. కాంట్రాక్టు లు గాని ఇవన్నీ గూడా ఆవిడే చూసుకుంటూ ఉండేవాళ్ళు. అప్పటికి స్వంతంగా చూసుకోగలిగేటటువంటి ధైర్యము, పరిణితీ వచ్చింది సూర్యకుమారిగారికి. ఆవిడ బొంబాయిలోనే ఒక ఫ్లాట్ తీసుకొని అక్కడే ఉన్నారు. వతన్ 1953 ఆ ప్రాంతాల్లో విడుదలయింది. ఆ సినిమా తర్వాత అక్కడే హిందీ లోనే మరొక చిత్రం మధుర మిలన్ లో కూడా అవకాశం వచ్చింది. అయితే ఈ మధుర మిలన్ అనే సినిమా ఎందుకో గాని మధ్యలో మానేసారు సూర్యకుమారి గారు. హిందీ సినిమాల్లో వేషాలైతే వచ్చాయి గాని పాటలు మాత్రం ఆవిడ పాడలేదు. ఆ తర్వాత వచ్చింది దిలీప్ కుమార్ తోటి కలిసి నటించిన చిత్రం "పురన్ కటోలా" .

అది 1955 లో విడుదలైంది. అది ఒక జానపద ఫాంటసీ సినిమా. అలాంటిది ఆ సినిమాలో హీరోయిన్ పాత్ర కాకపోయినప్పటికీ సూర్యకుమారి గారికి చాలా ముఖ్యమైన పాత్ర దొరికింది అందుకే ఇప్పటికి కూడా సూర్యకుమారి గారి హిందీ సినిమాలు అనగానే పురన్ కటోలా చిత్రాన్నే చాలామంది ఉదహరిస్తూ ఉంటారు.

ఈ పురన్ కటోలా సినిమా జరుగుతూ ఉండగా సూర్యకుమారి గారికి మరొక అమ్మాయి తో పరిచయమయ్యింది. ఆమె పేరు లూడ్ మిల్లా ప్రేమకోఫ్. లూడ్ మిల్లా ప్రేమకోఫ్ ఒక రష్యన్ చిత్ర కళాకారిణి. ఆవిడ ఈ సినిమాల్లో కాస్ట్యూమ్స్. పబ్లిసిటీ ఇలాంటివి చూస్తూఉండేవాళ్ళు. పురన్ కటోలా సినిమాలో సూర్యకుమారి గారు వేసినట పాత్ర రాజసం ఉట్టిపడేటటువంటి పాత్ర. ఆ పాత్రని ప్రముఖంగా కనపడేలా చేస్తూ వాల్ పోస్టర్స్ డిజైన్ చేయడంలో ముఖ్య పాత్ర వహించింది లూడ్ మిల్లా ప్రేమకోఫ్ అనే ఆవిడ. తర్వాతి రోజుల్లో కూడా మళ్ళా సూర్యకుమారి గారు విదేశాల్లో స్థిరపడడానికి కూడా చాల సహాయం చేసారావిడ. ఇలాగ ఆమె జీవిత ప్రయాణంలో ఒకొక మలుపులో పరిచయమైనటువంటి ఒకొక్కళ్ళు ఆ తర్వాత భవిష్యత్తులో ఆమె యొక్క జీవితం స్థిరపడటానికి , వేరే మార్గాల్లోకి మళ్ళించడానికి కూడా సహాయపడ్డారు.

ఆ తర్వాత 1956 లో బాంబే ఫ్లైట్ నంబర్ 417 అనే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఇది ఇండో అమెరికన్ ఆ ఇద్దరియొక్క కలయిక తోటి చిత్రీకరించినటువంటి సినిమా. కానీ దురదృష్టవశాత్తు ఆ సినిమా పూర్తికావడం కానీ, విడుదల కావడం కానీ జరగలేదు. ఆవిడ ఈ బొంబాయిలో ఉండి హిందీ సినిమాల్లో పాత్రలు ధరిస్తున్న రోజుల్లోనే ఆమె గాయని అని తెలుసుకొని శాంతారాం గారు అప్నా దేశ్ అనే సినిమాని తెలుగులోకి అనువాదం చేస్తూ పాటలు పాడడానికని సూర్యకుమారి గారిని పిలిచారు. ఆ సినిమాలో నటించకపోయినా ఆ అనువాద చిత్రానికి అందులో ఆరు పాటలో, ఎనిమిది పాటలో సూర్యకుమారి గారే పాడారు. ఆ రోజుల్లో అప్నాదేశ్ లో సూర్యకుమారి గారు పాడిన పాటలు కూడా విపరీతంగా ప్రజాదరణ పొందినవి.

ఇది 1948 నుంచి మధ్యలో ఆవిడ విదేశాలు వెళ్లొచ్చాక మళ్ళీ ఈ హిందీ సినిమాల్లో ఆవిడ నటించినటువంటి వైనం! 1956 లో తల్లి గారు గారు కూడా మరణించారు సూర్యకుమారి గారికి. ఇంకా దాదాపుగా ఒంటరి అయ్యారు అని చెప్పుకోవచ్చు. నాన్నగారు లేరు, అమ్మగారు లేరు కేవలం అన్నయ్యలు, తనకి సహాయం చేస్తున్నటువంటి అక్కయ్య గారి అమ్మాయి అనసూయ వీళ్ళతోటే ఉండేవాళ్ళు సూర్యకుమారి గారు. హిందీ సినిమాల రోజుల్లో కూడా ఆవిడ మద్రాస్ వచ్చినప్పుడల్లా గాయనిగా ప్రదర్శనలిస్తూ ఉండేవాళ్ళు. ఆ వచ్చిన విరాళాలాల్ని వినియోగిస్తూ ఉండేవాళ్ళు.

1957 తర్వాత ఇంకా దాదాపుగా ఆమె చిత్ర జీవితం చివరిదశ అని చెప్పుకోవచ్చు. "చిత్ర జీవితం" అంటున్నానండి ! జాగ్రత్తగా గమనించాలి! ఆవిడ చిట్టచివరగా నటించిన చిత్రం చిత్తూరు నాగయ్యగారి భక్త రామదాసు. ఆ సినిమా మొదలు పెట్టాక దాదాపు ఐదారు సంవత్సరాలు నిర్మాణం జరిగింది. మొదట్లో ఉన్న చాలామంది నటులు, నిర్మాణం మధ్యలో మరణించారు. నాగయ్య గారి మీదున్న గౌరవంతోనే , 1959 ప్రాంతాల్లో భక్తరామదాసు లో తానీషా గారి భార్యగా నటించారు టంగుటూరి సూర్యకుమారి గారు.

భక్తరామదాసు తర్వాత మళ్లావిడ సినిమాల్లో వేయలేదు. వాళ్ళమ్మగారు మరణించాక ప్రాంతాల్లో సూర్యకుమారిగారు జీవితంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించ దలుచుకున్నారు. ఆ కొత్త అధ్యాయమేమిటంటే, స్వంతంగా రంగస్థల నాటకాలని రూపొందించడం, ప్రదర్శింపజేయడం – ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది? సినిమాల్లో నటిస్తుంటే అవకాశాలు రాలేదా అంటే, అవకాశాలు వచ్చాయి, .కాకపోతే మనం జాగ్రత్తగా గమనించాల్సింది 1958– 59 వచ్చేసరికి సినిమాల్లో కొంచెం గ్లామర్ పాళ్ళు కూడా ఎక్కువైనవి. అందులో కథానాయిక అనగానే అందంగా ఉండాలి అందచందాలు చూపించాలి అనే కథలు రావడం, అలాగే ఎవరి పాటలు వాళ్ళే పాడుకోవడం కంటే నేపథ్యగీతాలు ఎక్కువగా రావడం ఇది జరిగింది. సూర్యకుమారిగారు నటించిన సినిమాలన్నింటిని చూసుకున్నట్లైతే, ఎక్కడా ఆవిడ గ్లామర్ పాత్రలు చేయలేదు. నటనకి అవకాశమున్న పాత్రలు, గాయనిగా అవకాశమున్న పాత్రలు మాత్రమే చేశారు. మరి గ్లామర్ పాత్రలు అనేవి ఆమెకు నప్పే పాత్రలు కావు కాబట్టి ఒక విధంగానూ, మరి పాటలన్నీ నేపథ్యగానాలవ్వడం తో ఒక విధంగానూ బహుశా ఆ కారణాలవల్ల సూర్యకుమారి గారు సినీ రంగం నుంచి విరమించుకుందామని అనుకుని ఉండొచ్చు. ఆ నిర్ణయం తీసుకున్నాక 1956–.57 ప్రాంతాల్లోనే కళాచైతన్య అనే సంస్థని స్థాపించారు. ఆ సంస్థ ద్వారా రంగస్థల నాటకాలు, ముఖ్యంగా, నృత్య ప్రధానమైన రంగస్థల నాటకాలు ప్రదర్శించాలి అనుకొన్నారు. అందులో భాగంగా ఆవిడ చేసిన మొట్టమొదటి ప్రయోగం ఏమిటి?ఆ ప్రయోగం ఎలా జరిగింది? దాని తర్వాత ఆ ప్రయోగాన్ని కొనసాగిస్తున్నరోజుల్లోనే ఆవిడ భారత దేశాన్ని వదిలి వెళదామని ఎందుకు అనుకున్నారు? ఎక్కడికి వెళ్లారు ? ఎలా స్థిరపడ్డారు?ఈ విశేషాలన్నీ కూడా వచ్చేవారం టంగుటూరి సూర్యకుమారి గారిని గురించిన ప్రత్యేక కార్యక్రమం మూడవ భాగంలో తెలుసుకుందాం .

(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొడ్డు సత్యనారాయణ)

(సశేషం)

★★★

2018 ఏప్రిల్ 10 న ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS